6న ఛలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

సర్పంచ్‌ల 16 డిమాండ్ల కోసం ముట్టడి

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

- 7లో



'ముంచేశారే'!

- వైసీపీపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకతతో కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు తలనొప్పి
- బలవంతంగా బరిలోకి దిగాల్సిరావడంతో ఏంచేయాలో పాలుపోని పరిస్థితి
- సొంత సర్వేలో వచ్చిన చేదు ఫలితాలతో మింగలేక.. కక్కలేక అయోమయం
- మూడుచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చినా తగ్గని వ్యతిరేకతతో గగ్గోలు
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే, పెద్దాపురం ఇన్‌ఛార్జిలను మార్చకపోతే కష్టమేనని భావన
- వీరిద్దరి సీట్లు మార్చాలంటూ తాజాగా అధిష్ఠానం వద్ద పట్టుబట్టిన సునీల్
- బలవంతంగా దించిన తనకు జట్టు కూర్పుపై స్వేచ్ఛ కావాలంటూ ఒత్తిడి
- మరోపక్క గత ఎన్నికల నుంచీ సునీల్, ద్వారంపూడి మధ్య విభేదాలు
- తాజాగా ఎంపీగా బరిలోకి దిగుతుండడంతో ఎక్కడ దెబ్బకొడతారేమోనని అనుమానం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ అధిష్ఠానం బలవంతంతో కాకినాడ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన చలమలశెట్టి సునీల్‌కు ప్రభుత్వ వ్యతిరేకత తలపట్టుకునేలా చేస్తోంది. అయిష్టంగా పోటీకి దిగాల్సి రావడంతో ఏంచేయాలో పాలుపోక ఆయన ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. క్షేత్రస్థాయిలో చేయించుకున్న సర్వే ఫలితాలు షాక్ ఇస్తుండడంతో బయట పడడమెలాగో తెలియక బెంబేలెత్తుతున్నారు. ఓటమి భయంతో ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను జగన్ మార్చినా క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత కొనసాగుతన్నట్లు తేలడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. అటు కాకినాడ సిటీ, పెద్దాపురం నియోజకవర్గాల్లోను ఇదే పరిస్థితి ఉండడంతో మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యేతోపాటు పెద్దాపురం ఇన్‌ఛార్జిని కూడా మార్చాలని అధిష్ఠానం వద్ద తాజాగా పట్టుబడుతున్నారు. ఒప్పించి తనను బరిలోకి దించినందున తన ఎన్నికల జట్టును ఎంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. గతఎన్నికలనుంచి సునీల్, ద్వారంపూడికి మధ్య విభేదాలున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో తనను పరోక్షంగా దెబ్బ కొట్టే అవకాశాలు లేకపోలేదని సునీల్ అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు సీట్లను మార్చే విషయమై తెగ ఒత్తిడి తెస్తుండడం వైసీపీ వర్గాలను కలవరపరుస్తోంది.

మార్చాల్సిందే..

ఎన్నికలు దగ్గరపడ్డ తరుణంలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతుండడంతో వైసీపీ పెద్దలకు ఏం పాలుపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఓటమి భయంతో అనేక చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వకుండా పక్కనపెట్టేస్తున్నారు. జిల్లాలోను ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ చించేశారు. ప్రస్తుత ఎంపీ వంగా గీతను పిఠాపురానికి పంపడంతో ఖాళీ అయిన ఎంపీ స్థానానికి ఎవరిని బరిలోకి దించాలో కూడా దాదాపు రెండు నెలలు కసరత్తు చేసినా వైసీపీకి అభ్యర్థులు దొరకలేదు. పలువురు ఎమ్మెల్యేలను పంపాలని చూసినా వారు కూడా కాదనేశారు. ఈ నేపథ్యంలో గతంలో ఇక్కడి నుంచి మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయిన చలమశెట్టి సునీల్‌ను వైసీపీ పెద్దలు బలవంతంగా బరిలోకి దించారు. ఈ మేరకు టిక్కెట్ ఆయనకు ఖరారు చేస్తూ పార్టీ అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి సునీల్ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. మూడుసార్లు ఓటమిపాలైన తాను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల్లోకి రాకూడదని భావించారు. కుదిరితే రాజ్యసభకు వెళ్లాలని ప్రయత్నించారు. కానీ అభ్యర్థుల కొరతతో అతికష్టంపై సునీల్‌ను వైసీపీ పెద్దలు కాకినాడ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించడానికి ఒప్పించారు. అటు అంగీకరించకపోతే తన వ్యాపారాలపై జగన్ సర్కారు కక్షతో ఎక్కడ దెబ్బకొడు తుందోననే భయంతో అయిష్టంగా సునీల్ బరిలోకి దిగారు. తీరా చూస్తే ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏవీ అనుకూలంగా లేకపోవడంతో తలపట్టుకుంటున్నారు.

నియోజకవర్గాల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

జిల్లాలో ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం సర్వేలో తేటతెల్లం కావడంతో మింగలేక కక్కలేకపోతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట స్థానాల్లో ఎమ్మెల్యేలను మార్చి కొత్త ఇన్‌చార్జులను నియమించినా పార్టీపై వ్యతిరేకత పెద్దగా తగ్గలేదని తన సర్వేలో నిగ్గుతేలింది. దీంతో ఏం చేయాలో తెలియక సునీల్ తల బాదుకుంటున్నారు. అటు కాకినాడ సిటీ, పెద్దాపురం నియోజకవర్గాల్లోను అదే పరిస్థితి ఉండడంతో ఇక్కడ అయితే మార్పులు చేయాలని వైసీపీ అధిష్ఠానం వద్ద తాజాగా సునీల్ పట్టుబట్టారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి, పెద్దాపురం ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబులను మార్చి వేరొకరికి టిక్కెట్ ఇస్తే కొంతవరకు పోటీ ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందని పార్టీ పెద్దలకు తన సర్వే గణాంకాలతో ఇటీవల వివరించారు. ఎమ్మెల్యేగా ద్వారంపూడి దందాలు, అవినీతి నేపథ్యంలో కాకినాడ సిటీలో తీవ్రంగా వ్యతిరేక గాలి వీస్తోందని, అటు పెద్దాపురంలో పార్టీ గ్రూపులుగా విడిపోవడంతో అక్కడ క్యాడర్ సహకరించే అవకాశం లేదని పార్టీ పెద్దలకు సునీల్ కూలంకుషంగా వివరించి చెప్పారు. వద్దన్నా తనను బలవంతంగా బరిలోకి దించిన నేపథ్యంలో నియోజకవర్గాల్లో జట్టు కూర్పు తాను అనుకునేలా ఉండేలా చూడాలంటూ పట్టుబడుతున్నారు. దీంతో ఇప్పుడు సునీల్ ఒత్తిడితో వైసీపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. ఆయన్ను బలవంతంగా ఒప్పించి బరిలోకి దించిన నేపథ్యంలో సూచించిన మార్పులు ఏ మేరకు చేయాలో తేల్చుకోలేకపోతోంది. మరీ తప్పనిసరి అయితే పెద్దాపురం ఇన్‌ఛార్జిని మార్చడానికి పార్టీ పెద్దలు కొంత సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కానీ ద్వారంపూడి విషయంలో ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేకపోతోంది. కానీ సునీల్ మాత్రం ఈ రెండు చోట్లా మార్చాల్సిందేనని పట్టుబడుతున్నారు. సునీల్‌కు, ద్వారంపూడికి మధ్య పెద్దగా సత్సంబంధాలు లేవు. గత ఎన్నికల్లో సునీల్ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా కాకినాడ నుంచి బరిలోకి దిగారు. అప్పుడు కాకినాడ సిటీలో కాపు సామాజికవర్గ నేతలను ఆకర్షించే విషయంలో ఇరువురి మధ్య వివాదం నెలకొంది. సునీల్‌కు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబుతో సత్సంబంధాలున్నాయి. కానీ కన్నబాబు అంటే పడని ద్వారంపూడి సునీల్‌తో అంటీముట్టనట్లు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గత అనుభవాల దృష్ట్యా ద్వారంపూడి తనను పరోక్షంగా ఎక్కడ దెబ్బ కొడతారోననే అనుమానాలు సునీల్‌ను వెన్నాడుతున్నాయి. తాజాగా రెండు సీట్ల మార్పు విషయంలో సునీల్ వైసీపీ పెద్దల వద్ద గట్టిగా పట్టుబడుతున్నారు. పార్టీ అధినేత జగన్ ఏం నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారింది.



సభలో మాట్లాడుతున్న మహాసేన రాజేష్

జగన్‌ను గద్దె దింపాలి

- 7లో

- దళితులంతా ఏకమవ్వాలి
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తలు

ప్రాక్టికల్ పరీక్షలు జరిగే కళాశాలల్లో..

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈవో) జీజీకే నూకరాజు

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 3: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరిగే కళాశాలల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి(డీఐఈవో) జీజీకే నూకరాజు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరం పరీక్షల నిర్వహణ నిమిత్తం డీఐఈవో అధ్యక్షతన కాకినాడ పీఆర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులందరికీ శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో పీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీఆర్ కృష్ణారావు, జిల్లా ఎగ్జామినేషన్స్ కమిటీ(డీఈసీ) సభ్యులు మూర్తిరాజు, అప్పలరాజు, జ్యోతుల రాంబాబు వృత్తి విద్యా సభ్యులు పల్లేశ్వరరావు, వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్ శాంతి రాజశ్రీ అధ్యాపకులకు అవగాహన కల్పించారు. డీఐఈవో నూకరాజు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లాలో మొదటిసారిగా పరీక్షలు నిర్వహిస్తున్నామని వృత్తి విద్యాపరీక్షలు ఈనెల 5 నుంచి 20 వరకూ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకూ, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకూ జనరల్ విద్యార్థులకు ఈనెల 11నుంచి 20 వరకూ జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించి పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులు నిర్దేశించిన సమయానికి పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈసీ సభ్యులు రాంబాబు మాట్లాడుతూ కమిషనర్ టెక్నాలజీకి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతిరోజూ పరీక్ష తర్వాత మార్కులను బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరచాలి కాబట్టి ప్రతి కళాశాలలో తప్పనిసరిగా కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు అధ్యాపకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సామర్లకోట, ఫిబ్రవరి 3: సామర్లకోట శివారు ఉండూరురోడ్-ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులో కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు పెద్దఎత్తున నిర్వహించనున్నట్టు పోటీల నిర్వాహకులు పైణ్ణి గౌరీచంద్, కాటూరి జానకిరామ్, పైణ్ణి చిట్టియ్య, రామకృష్ణ, బిక్కిన శ్రీరంగనాయకులు తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరుగనున్న పోటీలకు ఇప్పటికే 40 జతల ఎడ్లు చేరుకున్నట్టు తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథులు మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ప్రముఖ వ్యాపారవేత్త చందలాడ పద్మరాజు హజరవుతారన్నారు.పోటీలను చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రమౌళి ప్రారంభిస్తారని చెప్పారు.

విజ్ఞానయాత్రల్లేవ్..



- ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 విద్యార్థులకు అన్యాయం
- నాలుగేళ్లుగా డబ్బులు విదల్చని వైసీపీ ప్రభుత్వం

పెద్దాపురం, ఫిబ్రవరి 3: పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రల నిర్వహణకు ఇవ్వాల్సిన గ్రాంట్లకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో విద్యార్థులు విహార యాత్రలకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఈ గ్రాంట్లు ఇవ్వకుండా మొండిచేయి చూపడంపై విద్యార్థి, ఉపాధ్యాయ వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడకముందు ఉన్న పాలకులు ప్రతిఏడాది 9,10 తరగతులు చదివే విద్యార్థులను వారు చదువుకునే ప్రదేశానికి సమీపంలో ఉన్న పర్యాటక ప్రదేశాలు, ప్రాజెక్టులు, ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించేందుకు ఏటా నిధులు విడుదల చేసేవారు. ఈ నిధులతో విద్యార్థులు ఒక రోజల్లా ఆయా ప్రదేశాల్లో పర్యటించి సరికొత్త అంశాలను తెలుసుకునేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైననాటినుంచి ఈ గ్రాంట్లు ఒక్క ఏడాదికూడా విడుదల చేయలేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

వాటిని రద్దు చేసి..

విద్యార్థులను తీసుకెళ్లడం అనేది చదువులో భాగమని, వారికి ఆయా ప్రాజెక్టులు, ప్రదర్శనశాలలు గురించి నేరుగా చూపించి పరిచయం చేస్తే వాటి గురించి సమగ్రంగా తెలుసుకునే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు విహార యాత్రలను ప్రోత్సహిస్తే వైసీపీ ప్రభుత్వం వాటి ఊసే మరిచిపోయింది. కాకినాడ జిల్లాలో 9,10 తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విహార యాత్రలు లేకపోయినా ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు విహార యాత్రలకు తీసుకువెళ్తున్నాయి. ఆ చొరవ మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో లోపించింది. రెండేళ్ల కిందట ఆర్ఎంఎస్ఏ, సర్వశిక్ష అభియాన్‌ను రద్దు చేసి సమగ్ర శిక్ష అని కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కింద ఇప్పటివరకూ పిల్లల్ని విహార యాత్రలకు తీసుకువెళ్లాలని చెప్పి పైసా గ్రాంటు విడుదల చేయలేదు.

ఇచ్చే రూ.200 తోడు..

గతంలో విహార యాత్రలకు వెళ్లే ఒక్కో విద్యార్థికి రూ.200 చొప్పున గ్రాంటు నుంచి ఖర్చు పెట్టేవారు. దానికితోడు కొంత మొత్తాన్ని పిల్లలు తమ సొంత డబ్బులు వేసుకుని ఆయా ప్రాంతాలు, ప్రాజెక్టులు సందర్శించి అనేక విద్యా విషయక, వైజ్ఞానిక అంశాలను తెలుసుకునేవారు. ప్రస్తుతం ఇవి లేకపోవడంతో పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలు ఉండడం లేదని ఉపాధ్యాయులే చెబుతున్నారు. నాలుగుగోడల మధ్య కూర్చోబెట్టి బోధన చేయడం కంటే వారికి నేరుగా ఆయా అంశాలను చూపించి వివరిస్తే త్వరగా అర్థం చేసుకుంటారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్సు టీచర్లు విద్యార్థులను పలు ప్రాంతాలకు తీసుకువెళ్లేవారు. 9, 10 తరగతుల పిల్లలకు సైన్సులో విద్యుత్ తయారీ, నీటిపారుదల ప్రాజెక్టుల గురించి కొంత సిలబస్ ఉంటుంది. ఈ పర్యటనల ద్వారా ఆయా అంశాలపై వారు మంచి పట్టు సాధించడానికి అవకాశం ఉండేది. ఇలాంటి కీలకమైన పర్యటనలకు ప్రభుత్వం నిధులు నాలుగేళ్లుగా విడుదల చేయకపోవడం విద్యార్థులు విహార, విజ్ఞానయాత్రలకు దూరం చేయడమేనని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

పాదగయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ



- గడువు ముగిసిన రోజే కొత్త ట్రస్టు బోర్డు ఏర్పాటుకు అనుమతి
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా భర్తీకి హడావుడి

పిఠాపురం, ఫిబ్రవరి 3: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి శనివారం నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల తేదీల ప్రకటనకు ముందే నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని అధికార పార్టీ నేతలు హడావుడి పడుతున్నారు. ఆ మేరకు త్వరితగతిన పదవిని భర్తీ చేయాలని దేవదాయశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

20రోజుల్లోగా పత్రాలు సమర్పించాలి

దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్ఠాన దేవతయిన పురుహూతికాఅమ్మవారు, రాజరాజేశ్వరీసమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి, స్వయంభూ దత్తాత్రేయస్వామి కొలువైఉన్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకానికి కసరత్తు ప్రారంభమైంది. ఇందుకు సంబంధించి ధర్మకర్తల నియామకానికిగాను దేవదాయశాఖ కమిషనరు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా, స్థానిక దేవదాయశాఖ అధికారులు ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను శనివారం ప్రచురించారు. ట్రస్టీల నియామకానికిగాను అవసరమైన దరఖాస్తులను ఆసక్తిగల వారు పూర్తి చేసి అందుకు అవసరమైన పత్రాలను జత చేసి నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచి 20రోజుల్లోగా కాకినాడలోని దేవదాయశాఖ ఉపకమిషనరు కార్యాలయంలో అందజేయాలని పాదగయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయశాఖ చట్టం నిబంధనలను అనుసరించి నిర్ణీత ప్రొఫార్మా ప్రకారం ఫారం-2లో దరఖాస్తులు పూరించి ఇవ్వాలని సూచించారు.

అఘమేఘాలపై...

పాదగయ ధర్మకర్తల మండలి ఆగంటి ప్రభాకరరావు, ఇతర ధర్మకర్తల పదవీకాలం ఫిబ్రవరి 2వతేదీ శుక్రవారం ముగిసింది. వీరి పదవి కాలం ముగిసిన రోజునే కొత్త ట్రస్టుబోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ కావడం, ధర్మకర్తల నియామకానికి చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ కమిషనరు నుంచి ఆదేశాలు రావడం జరిగిపోయాయి. ఫిబ్రవరి రెండో వారం దాటిన తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలోగా ట్రస్టుబోర్డు నియామకం పూర్తి చేయాలని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. దరఖాస్తుల గడువు ముగిసిన రెండు, మూడు రోజుల్లోనే ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులు జారీ అయ్యేలా పావులు కదుపుతున్నారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు హయంలో నియమితులైన ప్రస్తుత పాలకమండలికి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న వంగా గీతావిశ్వనాథ్ అవకాశం కల్పిస్తారా, లేకుంటే కొత్తవారికి అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు నియోజకవర్గంలో పదవీ కాలం పూర్తయిన ఇతర దేవాలయాల ట్రస్టుబోర్డుల నియామకానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వాడపల్లిలో భక్తుల కిటకిట



ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రమైంది. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని ఫలపుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా గోవిందనామస్మరణతో స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖుల కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.34.07 లక్షలు లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



క్యూలైన్‌లో భక్తులు





పొగమంచు కమ్మేసింది..

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: పచ్చని కోనసీమలో శనివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకూ మంచు దుప్పటి కప్పేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రహదారులు అలాగే ఇళ్లపై దట్టమైన పొగమంచు కమ్మేసింది. అనంతరం మధ్యాహ్నాం నుంచి భానుడు ఉగ్రరూపం దాల్చాడు.

గోపురాలు స్వర్ణమయం చేసేందుకు పరిశీలన



పరిశీలన చేస్తున్న దృశ్యం



అన్నవరం, ఫిబ్రవరి 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ప్రధానాలయ విమాన గోపురం, ఇతర ఉపాలయాల గోపురాలను స్వర్ణమయం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత పాలకమండలి సమావేశంలో ఆమోదం పొంది కమిషనర్ అనుమతి కోసం ఈవో రామచంద్రమోహన్ లేఖ రాయడంతో శనివారం దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలసి విమానగోపురం, ఉపాలయాల గోపురాలను పరిశీలించారు. దీనికి సుమారు 12.5 కిలోల బంగారం అవసరమవుతుందని రూ.8 కోట్లు వ్యయం కాగలదని ప్రాథమిక అంచనా వేసినట్లు పరమేశ్వరప్ప పేర్కొన్నారు. అయితే గత కొలతల ఆధారంగా అంచనా వేశామని దేవదాయ శాఖ కార్యాలయంలో మరోసారి కొలతలపై లెక్కకట్టి స్పష్టమైన వ్యయం తెలుపుతామని అన్నారు. స్థపతి వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజబాబు తదితరులున్నారు. అనంతరం దేవదాయశాఖ స్థపతి ఈవో కార్యాలయంలో రామచంద్రమోహన్‌ను కలసి అంచనా వ్యయంపై చర్చించారు. దీనికయ్యే వ్యయం డోనార్ స్కీం ద్వారా పూర్తిచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆలోచన చేస్తున్నారు. సుమారు 12 ఏళ్ల క్రితం రామచంద్రమోహన్ ఈవోగా పనిచేసిన కాలంలో ఆలయ పునర్నిర్మాణం చేపట్టగా అప్పట్లో బంగారు తాపడం చేయాలనే ఉద్దేశంతో విమాన గోపురానికి గ్రానైట్ కాకుండా ఇటుకలతో నిర్మాణం చేపట్టారు. మళ్లీ ఆయన ఈవో బాధ్యతలలో ఉండడంతో విమానగోపురం బంగారం చేయించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు అడుగులు వడివడిగా పడుతున్నాయి.

దళితులంతా ఏకం కావాలి

జగన్‌ను గద్దె దింపాలి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3: దళిత ద్రోహి జగన్‌ను గద్దె దింపాలని, ఇందుకు దళితులంతా ఏకమవ్వాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభలో వక్తలు పిలుపునిచ్చారు. దగా పడ్డ.. దళితుడా.. నినాదంతో శనివారం కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టీడీపీ మాల సామాజిక సాధికారత సభకు మహాసేన రాజేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విచ్చేశారు. సభలో మాజీ ఎంపీ ఏపీ బుచ్చిమహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారాయణరావు, నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, మద్దాల చంటి, మొండి కమల ప్రసంగించారు. మహాసేన రాజేష్ మాట్లాడుతూ వైసీపీలో ఉన్న దళిత నాయకులందరూ దళిత ద్రోహులన్నారు. వైసీపీ ప్రభుత్వం దళితులను, కార్పొరేషన్లను విడగొట్టి పబ్బం గడుపుతుందన్నారు. ఒకప్పుడు దళితులు కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్య, స్వయం ఉపాధి పథకాలు ద్వారా తోడ్పాటు అందించిన ఘనత చంద్రబాబునాయుడుదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన వారిని అరెస్టు చేయాలని మన తరఫున ఆందోళన చేపట్టిన వనమాడి కొండబాబుకు అండగా ఉండాలన్నారు. ఎవరైనా మనజోలికి వస్తే ఊరికే పంపించవద్దని, వారికి తగిన రీతిలో సారె పెట్టి పంపించాలన్నారు. కాకినాడలో ఈ సభ జరగకుండా చేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అన్ని విధాలా ఆటంకాలు కల్పించాడని, సభకు వెళ్లితే సంక్షేమ పథకాలు పోతాయని దళితులను బెదిరించాడన్నారు. వైసీపీ నాయకుల కేసులకు, వలంటీర్ల బెదిరింపులకు భయపడకుండా సభకు తరలివచ్చిన మాలలను చంద్రశేఖరరెడ్డి చూసుకోవాలని రాజేష్ సవాల్ చేశారు. ఇదే పరిస్థితి చంద్రశేఖరరెడ్డికి ఉంటే ఇంటి లోంచి గుమ్మం దాటడని, మావాళ్లు గుమ్మాలు దాటి, ఊళ్లు దాటి సభకు తరలి వచ్చారన్నారు. తన మీద ఇప్పటికే 30 కేసులు పెట్టించారని అన్నారు. ద్వారంపూడి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, దళితుల ఓట్ల ద్వారానే ద్వారంపూడికి బుద్ధి చెబుతామన్నారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, జగన్‌రెడ్డి రద్దు చేసిన 27 దళితుల సంక్షేమ పథకాలు మళ్లీ అమలు చేయడం తథ్యమన్నారు. మోకా ఆనందసాగర్ మాట్లాడుతూ దళిత కార్పొరేషన్‌ను ముక్కలు చేసిన ఘనత జగన్మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. గత నాలుగన్నరేళ్లలో 2,700 మంది దళితులపై దాడులు జరిగినా ఒక్కరికి కూడా శిక్ష పడలేదన్నారు. ఇంత అన్యాయం దళితులకు జరిగినా ఇంకా వైసీపీ ప్రభుత్వానికి కొంతమంది దళితద్రోహులు భజన చేస్తున్నారన్నారు. కాశి నవీన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అనేక మంది దళితులు అక్రమంగా శిక్షింపబడ్డారన్నారు. నక్కా సునీల్ మాట్లాడుతూ వైసీపీ దళిత ద్రోహి పార్టీ అన్నారు. దళితులకు రాజకీయాల్లోను, ఉన్నత విద్యలోను అవకాశం కల్పించిన ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, దళిత యువకులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. యువకుల నినాదాలతో ప్రాంగణం మారుమోగింది. దళిత నాయకులు బత్తుల సాయి, సీకోటి అప్పలకొండ పాల్గొన్నారు.

దళితులకు ద్రోహం చేసిన జగన్‌ను

దించేస్తున్నాం

అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 3: దళితులకు ద్రోహం చేసిన సీఎం జగన్‌ను దించేయబోతున్నామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో శనివారం దళిత సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో జగన్ దళితులను అణగదొక్కాడని, దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకే ఈనెల 11న రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు. దళితులకు అన్యాయం జరుగుతుంటే వైసీపీలో మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న దళితులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో దళితులకు మేలు చేసే 27 పథకాలను రద్దుచేస్తే అడిగేవాడు లేడని, నవరత్నాల్లో అమ్మఒడి పథకంలో అందరికీ వేసే డబ్బులు జనరల్ ఫండ్స్ నుంచి కేటాయించి, దళితులకు మాత్రం సబ్‌ప్లాన్ నుంచి ఎందుకు కేటాయించారని హర్షకుమార్ ప్రశ్నించారు. ఎస్సీ వసతి గృహాల్లో దుర్భర పరిస్థితులు ఉన్నాయని, స్టడీ సెంటర్లు నిర్వీర్యం చేశాడని, ఇక యూనివర్సిటీల్లో వీసీలంతా జగన్ కులస్తులేనని అన్నారు. డాక్టర్ సుధాకర్, కిరణ్‌కుమార్, దొమ్మేరులో బొంత మహేంద్ర, సామర్లకోటలో గిరిబాబు, ఎర్రగొండలో మోజెస్, కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను పొట్టన పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. హత్యచేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ వస్తుంది కాని దళితుడైన కోడికత్తి శ్రీనివాస్‌కు బెయిల్ రాదు అని అన్నారు. కోడికత్తి శ్రీను బెయిల్ విషయంలో రాష్ట్ర గవర్నర్ స్పందించాలన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఎటువంటి ఆహంకారంతో ఉన్నాడో అదే రీతిలో జగన్ ఉన్నాడని, అక్కడ కేసీఆర్‌కు పట్టిన గతే ఇక్కడ జగన్‌కు పడుతుందని హర్షకుమార్ అన్నారు. సమావేశంలో హర్షకుమార్ తనయుడు జీవి శ్రీరాజ్, ఎర్రా రామకృష్ణ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణం ప్రభుత్వ విజయమనడం సరికాదు

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



మాట్లాడుతున్న ఉండవల్లి అరుణకుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): 'గుడి కట్టినా, మసీద్ కట్టినా, చర్చి కట్టినా అది మతానికి సంబంధించినది. దానికి ప్రభుత్వం సహాయం చేస్తే చేయవచ్చు. కానీ రామాలయం కట్టడం ప్రభుత్వ విజయమని కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము ప్రకటించడం సరికాదు' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ముస్లిం దేశాలన్నీ సెక్యులర్ దేశాలుగా మారుతున్నాయన్నారు. దుబాయి వంటి దేశాల్లో గుళ్లు కడుతున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో సగానికి పైగా అంటే సుమారు 81 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నారని మరి దేశంలో పేదరికం పోయినట్లు ఎలా అనుకుంటామన్నారు. ప్రపంచ స్థాయి సర్వే సంస్థ ఒకటి ఇటీవల మిస్ ఇన్‌ఫర్మేషన్ అండ్ డిస్ ఇన్ఫర్మేషన్(పుకారులు, అబద్ధాలు) ఇవ్వడంలో భారతదేశం నెంబర్ 1గా ఉందని తేల్చారని ఆయన వివరించారు. ఇవాళ అందరిదీ జై శ్రీరామ్ అనే నినాదమైపోయిందని వాస్తవానికి హిందూమతమే సెక్యులర్ మతమన్నారు. ఇక బీజేపీ యాంటీ ముస్లిం వాతావరణాన్ని తీసుకొస్తోందని ఆయన అన్నారు. దేశంలో మోదీకి 38 శాతం మద్దతు ఉంటే వ్యతిరేకించే వారు 50 శాతం ఉన్నారన్నారు. వాళ్లంతా కలవాలని ఉండవల్లి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో జనాభా పెరిగిపోయిందని, దక్షిణ భారతంలో కుటుంబ నియంత్రణ వల్ల జనాభా కంట్రోలులో ఉందని అన్నారు. లోక్‌సభ స్థానాలు పునర్విభజన జరిగితే 800 వరకూ ఎంపీ స్థానాలు ఉంటాయని ఉత్తర భారతంలో ఎక్కువ ఎంపీ స్థానాలు పెరుగుతాయన్నారు. పన్నుల ఆదాయం మనకంటే ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ వెళుతుందన్నారు. అందుకే తమిళనాడు మంత్రి ఒకరు దక్షిణ భారతదేశం ప్రత్యేక దేశంగా విడిపోయే పరిస్థితులు వస్తున్నాయని అంటే, ఆయన మీద కేంద్రం విరుచుకు పడిందన్నారు. అర్బన్ ఏరియాలో బహిరంగంగా జగన్‌ను వ్యతిరేకిస్తున్నారని, జగన్ ఎన్ని తప్పులు చేయగలడో అన్ని తప్పులు చేశాడని ఉండవల్లి అన్నారు. చంద్రబాబు, పవన్ కలవడం వల్ల వైసీపీ వణికిపోవాలని, కానీ 40శాతం మందికి ఉచిత పథకాలు ఇచ్చానని, తానే నెగ్గేస్తానని జగన్ భావిస్తున్నాడన్నారు. అయితే చంద్రబాబు అతని కంటే ఎక్కువ పథకాలు ప్రకటించారని దీనిపై చర్చ జరగాలని అన్నారు. కాంగ్రెస్ బలపడాల్సిన అవసరం ఉందని షర్మిల వల్ల బలం పెరగవచ్చునన్నారు. కాంగ్రెస్ పెరిగితేనే కేంద్రంలో బీజేపీని ప్రశ్నించే వీలుంటుందన్నారు.

6న చలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

అంబాజీపేట, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 6వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజా ప్రతినిధులంతా జయప్రదం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, కార్యదర్శి రంబాల రమేష్ కోరారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లకు పరిష్కారం చూపాలని 6వ తేదీన అసెంబ్లీని ముట్టడించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘ నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేసిందని వెంటనే తిరిగి సర్పంచ్‌ల ఖాతాలకు జమచేయాలన్నారు. అలాగే సర్పంచ్, ఎంపీటీసీలకు రూ. 15 వేలు గౌరవ వేతనం, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు వంతున గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 3: జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె.శ్రీనివాసులు పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున కడియం మండలం మురమండ గ్రామశివారు ముత్యాలమ్మ ఆలయం దాటిన తర్వాత మట్టిరోడ్డు నందు కొంత మంది పేకాడుతున్నారని తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ శనివారం కడియం పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. మురమండ ప్రాంతంలో పేకాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రదేశానికి వెళ్లగా అక్కడ పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నామన్నారు. ఐదుగురు పరారయ్యారు పట్టుకున్నవారు ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తుల నుంచి రూ. 5,880 నగదు, 3 సెల్‌ఫోన్లు, 2 మోటారుసైకిళ్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 3: కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం ఎదురుగా గల పిండాల చెరువులో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానిక టూటౌన్ పోలీసులు గుర్తించారు. శరీరంపై ఆకుపచ్చ రంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ఉన్నాయని, ముఖాన్ని చేపలు కొరకడం వల్ల కొద్దిగా పాడైపోయిందన్నారు. మృతదేహాన్ని పరిశీలిస్తే చనిపోయి 48 గంటలు అయి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం టూటౌన్ పోలీసులను 9440796541, 9701626505 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 3: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఆవుల పుల్లారావు, కనకేశ్వరరావు అన్నదమ్ములు. గ్రామస్థులతో కలిసి శనివారం మోటారుసైకిళ్లపై కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి ఏడువారాల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా బొబ్బర్లంక దాటిన తర్వాత కొవ్వూరు మండలం మద్దూరు లంక గ్రామ సమీపంలో యాక్టివా.. మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ బైక్ పైనుంచి కింద పడిపోయారు. కనకేశ్వరరావు(27) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. కాగా కనకేశ్వరరావుకు భార్య, 3 నెలల కుమార్తె ఉన్నారు.

మూగజీవాలపై వింత జంతువు దాడి

పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని కాండ్రకోట గ్రామంలో మూగజీవాలపై వింత జంతువు దాడి చేస్తోందని గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. స్థానిక పీహెచ్‌సీ సమీపంలో నివసిస్తున్న షేక్ బాషా మేకను వింత జంతువు తినేసిందని స్థానికులు గుర్తించారు. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇది అసలు వింత జంతువు పనా లేక ఎవరైనా కావాలని చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గత వారం రోజుల కిందట గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేగడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు.

భార్యకు శిరోముండనం కేసులో వ్యక్తికి రిమాండ్

సీతానగరం,ఫిబ్రవరి 3: భార్యకు శిరోముండనం చేసిన నేరంపై నిందితుడు కర్రి రాంబాబు అలియాస్ అభిరామ్‌ను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ కోరుకొండ ఎ.నాగమురళి తెలిపారు. విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.. భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలు కారణంగా అభిరామ్ భార్యను చంపాలనుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యను కత్తి సహాయంతో బెదిరించి ట్రిమ్మర్ సహాయంతో గుండు గీసి చంపడానికి ప్రయత్నించగా చుట్టుపక్కల వారి సమాచారంతో బాధితురాలు ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారని నిందితుడిని శనివారం అరెస్టుచేసి రాజమహేంద్రవరం 7వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో సెలక్షన్ జాబితాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 3: రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకుల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ / సీహెచ్‌వో పోస్టుల ఫైనల్ సెలక్షన్ జాబితాలు జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్లలో ఉంచినట్టు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి జనవరి 12న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈనెల 5వ తేదీన ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకుల కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

గండేపల్లి, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామంలో శుక్రవారం రాత్రి ఒకే రోజు సాగునీటి బోర్లు వద్ద ఉన్న 5 ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగివైరును దొంగలించి ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్‌లు పడేసి వెళ్లిపోయారు. గండేపల్లి నుంచి సీతారాంపురం వెళ్లే రోడ్డులో ఉన్న పొలాల వద్ద సాగునీటి బోరులు వద్ద ఈ చోరీలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నిఘా పెట్టి తక్షణం నిందితులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆర్‌బీ పట్నంలోనూ అపహరణ

పెద్దాపురం, ఫిబ్రవరి 3: మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గడిచిన 3 నెలల వ్యవధిలో గ్రామానికి చెందిన కంటిపూడి రామ్మూర్తి అనే రైతు పొలంలో 2 సార్లు చోరీ జరిగినట్లు రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న రాగి తీగలను దొంగలు చోరీ చేస్తున్నారని, ఈ విషయంపై పోలీసులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో

భక్తుల రద్దీ

పెద్దాపురం, ఫిబ్రవరి 3: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 1,88,570 అన్నదాన విరాళాలు రూ.62,285 ఆదాయం, కేశఖండన ద్వారా 2800 వెరసి రూ.3,02,286 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.



మెర్లపాలెం సరిహద్దులో ఇసుక తవ్వకాలు

సర్పంచ్ ఫిర్యాదుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ



మెర్లపాలెం సరిహద్దులో తవ్వకాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 3: ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన కంపెనీ సరిహద్దులు దాటి ఇసుకను అక్రమంగా తరలించి సుమారు రూ.20 కోట్లు ప్రజాధానాన్ని అక్రమార్కులు లూటీచేశారని మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో శనివారం సాయంత్రం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించి విచారణ నిర్వహించారు. రావులపాలెం మండలం ఉబలంక పరిధిలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందింది. ఈ సంస్థ సరిహద్దులు దాటి మెర్లపాలెం సమీపంలో అనధికారకంగా బాటలు వేసి ఇసుక తవ్వకాలు నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.20 కోట్ల మేర ఇసుక తరలించుకుపోయారు. ఈ మేరకు జనవరి 18న సర్పంచ్ రాము సెబ్, మైనింగ్ అధికారులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇసుక కమిటీ చైర్మన్ కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే సమీప ప్రాంతంలోని లంకలను కొల్లగొట్టి నిత్యం వందల లారీలతో బొండుమట్టిని తరలించుకుని కోట్లాది రూపాయలు అక్రమార్కులు దోపిడీకి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు కొత్తపేట సీఐ(సెబ్) డి.సురేఖ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సర్పంచ్, వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక, బొండు మట్టి తవ్వకాలను నియంత్రించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

దంత వైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ మైలురాయి

ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్

రాజానగరం, ఫిబ్రవరి 3 : ప్రస్తుత కాలంలో దంతవైద్య విధానంలో ప్రోస్టాడాంటిక్ (కృత్రిమ దంత వైద్య) విధానం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ అన్నారు. ఇండియన్ ప్రోస్టాడాంటిక్ సొసైటీ ఏపీ శాఖ ఆధ్వర్యంలో రాజానగరం లోని కెఎల్‌ఆర్ లెనోరా దంతవైద్య కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్ర సదస్సు శనివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఐపీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సురేష్ సజ్జన్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రోస్టాడాంటిక్ సొసైటీలో 10వ రాష్ట్ర సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దంత వైద్యులు రెండు రోజులు పాటు జరిగిన ఈ సదస్సును దంత వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సు ఛైర్మన్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ తమ కళాశాలలో గత రెండు రోజులుగా జరిగిన ఈ సదస్సులో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 215 వైద్య నిపుణులు, పీజీ విద్యార్థులు హాజరై వివిధ ప్రజెంటేషన్లు అందించగా వాటిలో 14 ప్రజెంటేషన్లు ఎంపికైనట్లుగా చెప్పారు. వీనిలో ఉత్తమ సైంటిఫిక్ పేపర్లు ప్రజెంట్ చేసిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ శేషారెడ్డి, లెనోరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వప్రకాష్‌శెట్టి, కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ టీఎస్‌వీ సత్యనారాయణ, సైంటిఫిక్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ కొండక, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

కాకినాడ

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

పెద్దాపురం, ఫిబ్రవరి 3: పాన్ ఇండియా జువైనల్ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి శనివారం సందర్శించారు. జైలులో ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. న్యాయం సహాయం కావాలంటే న్యాయసేవాధికార సంస్థ ద్వారా పొందవచ్చన్నారు. న్యాయవాదులు మడికి రాంబాబు, పీఎల్వీలు నూతులపాటి అప్పలకొండ తదితరుల ఉన్నారు.

'అక్రమ నిర్మాణ పనులను ఆపివేయాలి'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 3: రమణయ్యపేట శివారు బర్మాకాలనీ హంసవాహినీ స్కూల్ సమీపంలో ప్రైవేట్ లేఅవుట్ సామాజిక స్థలంలో అక్రమ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని, ప్లాన్ అప్రూవల్‌ని బహిర్గతం చేయాలని కోరుతూ శనివారం రమణయ్యపేట పంచాయతీ కార్యాలయం వద్ద వీహెచ్‌పీ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కార్యదర్శి వెంకటరమణకు వినతి అందించారు. స్థలంలో నిర్మాణం, ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలని ఆందోళనకారులు పట్టుపట్టగా సోమవారం సమాచారం ఇచ్చేందుకు కార్యదర్శి హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ చేరుకుని ఆందోళనకారులు,పంచాయతీ అధికారులతో చర్చించారు. వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు నందూరి సత్తిబాబు, రంబాల వెంకటేశ్వరరావు, గట్టి సత్యనారాయణ, కాళ్ల ధనరాజు, ముత్తా నవీన్‌కృష్ణ, వై.మాలకొండయ్య పైడా కృష్ణమోహన్, మామిడాల శ్రీనివాసరావు, కంచుమర్తి చినఅప్పాజీ, ఫక్కి మణిబాల, పితాని లీలావతి పాల్గొన్నారు.

'చెత్త ప్రభుత్వాన్ని తరిమేందుకు సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి3: నూకాలమ్మ గుడి ప్రాంతంలో జనసేన నాయకులు మనోహర్‌లాల్‌గుప్తా ఆధ్వర్యంలో చెత్తపై పన్ను వేసిన చెత్త ప్రభుత్వాన్ని తరిమేయడానికి మేము సిద్ధం అనే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసురెడ్డి శివ మాట్లాడుతూ పాలనపై పట్టు లేకపోతే పరిస్థితులు అగమ్యగోచరంగా ఉంటాయన్నది ప్రభుత్వ విధానం బట్టి అర్థమవుతుందన్నారు. చరిత్రలో రకరకాల పన్నులు వేసిన చక్రవర్తులు చదువుకున్నాం కాని చెత్తపై కూడా పన్ను వేసిన ముఖ్యమంత్రిని జగన్‌ను చూస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన,టీడీపీ ఉమ్మడి పొత్తులో ప్రజాసంక్షేమ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, గంగమల్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్తిపాడు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తా'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తానని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు ఆశీస్సులతో ఈ మేరకు పార్టీ అధిష్టానానికి అభ్యర్థిత్వం మంజూరు కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీ సెల్ కోఆర్డినేటర్ కొల్లు వీరగణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, నియోజకవర్గ యువజన నాయకుడు ఇనుమల రాజా, దిడ్డి రాజబాబు పాల్గొన్నారు.

'అవగాహనతో సంపూర్ణ ఆరోగ్యం'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 3: క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి కాదని, ముందస్తుగా గుర్తించడం, అవగాహనతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని మెడికవర్ హాస్పిటల్స్ ఆంకాలజిస్ట్, సర్జికల్ ఆంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ ప్రషోబ్ అన్నారు. శనివారం కాకినాడ అచ్చంపేట మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ, సదస్సులో రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడీ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్యాన్సర్ నివారణపై ముద్రించిన పోస్టర్స్‌ని ఆవిష్కరించారు. క్యాన్సర్ నుంచి బయటపడి పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న రోగులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ పృధ్వీరాజ్ ఉన్నారు.

'దోమల బెడదతో అనారోగ్యాల బారిన ప్రజలు'

పిఠాపురం, ఫిబ్రవరి 3: పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన దోమల బెడదతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని, పిల్లలు, వృద్ధులు రాత్రిపూట నిద్రకరవు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు శనివారం మున్సిపల్ కమిషనర్ కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఫిర్యాదు చేశారు. ఎక్కడికక్కడ మురుగుకాలువలు, రోడ్డు పక్కన వ్యర్థాలు వేస్తున్నారని, పారిశుధ్యం మెరుగు, దోమల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3: ప్రత్తిపాడు ఎంఈవో కార్యాలయం వద్ద మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ 2019 పాదయాత్రలో మధ్యాహ్నభోజన కార్మికులకు అధికారంలోకి వచ్చాక రూ.10వేలు అందజేస్తామని ఇచ్చిన హామీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈవో వి.రాజబాబుకు అందజేశారు. ఆందోళనలో సీఐటీయూ నాయకుడు రొంగలి ఈశ్వరరావు, మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మి, రమణమ్మ, యూనియన్ నాయకులు మంగాలక్ష్మి, అనంతలక్ష్మి, సీతామహాలక్ష్మి, పుష్ప, లక్ష్మి, కుమారి పాల్గొన్నారు. ఏలేశ్వరంలో కూడా మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కె.రాము, అన్నావతి, వెంకటలక్ష్మి, ఏసమ్మ, గంగాభవాని, వై.సత్యవతి, నాగరత్నం, జి.అప్పలరాజు తదితరులు ఉన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, ఫిబ్రవరి 3: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 2 రోజులు పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. శనివారం రెండోరోజు యూనివర్శిటీ పెట్రోనర్స్ మలేషియాలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఈరైవన్ ఇలమ్ వరుతీ ఆన్‌లైన్‌లో ఆర్టిఫిషల్ ఇంటిజెన్స్ పరిశోధన విభాగంలో మెలకువలను వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, డీన్ అకాడమిక్స్ రమాశ్రీ అధ్యాపకులున్నారు.

మహాకుంభాభిషేక ఏర్పాట్ల పరిశీలన

జగ్గంపేట, ఫిబ్రవరి 3: మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన కోటి మట్టి శివలింగాలతో మహాకుంభాభిషేకం ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. కాశీ పట్టణంలో అఘోరీ మఠానికి చెందిన అఘోర ఎస్పీ శివశంకర్‌నాథ్ శనివారం మహాకుంభాభిషేక ఏర్పాట్లు ద్వాదశ లింగాల ప్రతిష్ఠ కార్యక్రమాల ఏర్పాట్లును పరిశీలించారు. జ్యోతుల లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, జ్యోతుల అనీష్ నెహ్రూ, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, దొమ్మ శ్రీను, మండపాక అప్పన్నదొర, పీటీ ప్రసాద్ తదితరులున్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

సామర్లకోట, ఫిబ్రవరి 3: సామర్లకోట మున్సిపాల్టీ పారిశుధ్యం విభాగంలో అవుట్‌సోర్సింగ్ వర్కర్, మాజీ కౌన్సిలర్ పొడుగు చిట్టిబాబు గుండెపోటుతో శనివారం మధ్యాహ్నం హఠాన్మరణం చెందారు. శనివారం తన ఇంట బంధువులకు విందు ఏర్పాటు చేసి ఆనందంగా తిరిగిన చిట్టిబాబు భోజనాల అనంతరం గుండెనొప్పితో కుప్పకూలాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కౌన్సిలర్లు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కమిషనర్ జాస్తి రామారావు మున్సిపల్ సిబ్బందితో శ్రద్ధాంజలి ఘటించారు.

సూర్యనారాయణస్వామికి విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 3: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సూర్యనారాయణస్వామికి ఉపాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి రాంబాబు తదితరులతో స్వామివారికి విశాఖ నక్షత్రం పర్వదినం సందర్భంగా విశేష అభిషేక పూజలు చేశారు నూతన పట్టు వస్త్రాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అంతకుముందు భీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచీ అధికసంఖ్యలో భక్తులు హాజరై దర్శనాలు అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు.

బస్సుల తరలింపుతో ప్రయాణికుల అగచాట్లు

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 3: ఏలూరు జిల్లా దెందులూరు వద్ద సీఎం జగన్ నిర్వహించే సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఎక్కేందుకు గంటల తరబడి చూడాల్సి వచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల మీదుగా తుని, కాకినాడ, ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సగానికిపైగా సభకు తరలించారు. దీంతో సర్వీసులు సంఖ్య తగ్గిపోయింది. మరోవైపు ప్రవేటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల విద్యార్థులను తరగతులకు రావాలని సూచించడంతో వారంతా ఆర్టీసీ బస్సులు ఎక్కేందుకు బస్టాపులకు వచ్చారు. ఎంతసేపు ఎదురుచూసిన బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించారు. బస్సులను ఇలా తరలించడం వల్ల తమకు అగచాట్లు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

» మాజీ మంత్రి యనమల

» టీడీపీలోకి చేరికలు



తుని: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల



ప్రత్తిపాడు: పార్టీ కండువాలు కప్పుతున్న సత్యప్రభ

తుని రూరల్, ఫిబ్రవరి 3: రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తునిలో శనివారం వైసీపీ నేత, మాజీ కౌన్సిలర్ ఎస్ఆర్ పృధ్వీరాజు, దంతులూరి వెంకటరమణరాజు, డీవీవీ.అచ్యుతరామరాజు, బీవీ సూర్యనారాయణరాజు, కె.ప్రవీణ్ వర్మ, డి.చైతన్యతో పాటుగా పలువురు క్షత్రియ కుటుంబీకులు యనమల సమక్షంలో టీడీపీలోకి చేరగా ఆయనతో పాటు రాష్ట్ర ఆర్గనైజిగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి అఖండ మెజార్టీతో తునిలో టీడీపీ అభ్యర్థి దివ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన దంతులూరి శ్రీనివాసరాజు, మాజీ ఎంపీపీ చిరంజీవి రాజు, తేటగుంట మాజీ సర్పంచ్ సూరిబాబు రాజు, సీహెచ్ చిరంజీవిరాజు, సీనియర్ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, చేడిశెట్టి గణేష్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి: సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3: తెలుగుదేశం పార్టీలోకి చేరిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. మండలంలోని గజ్జనపూడి గ్రామంలో 300 మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. స్థానిక నాయకులు పల్లా గోపి, దాకారపు కృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా పార్టీలోకి చేరిన వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడి పని చేయాలని, ఈ 2 నెలలు ఎంతో కీలకం కావడం వల్ల శ్రేణులు అప్రమత్తంతో పనిచేయాలని కోరారు. సీఎం జగన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను దగా చేస్తున్నారని, 50వేల పైబడి టీచర్ పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 6వేల పోస్టులు భర్తీకి హంగామా చేస్తున్నారని విమర్శించారు. పార్టీలోకి చేరినవారిలో గొనగాల వీరబాబు, కొల్లు ఏసుబాబు, నాగరాజు, పలివెల లోవరాజు, నమ్మి సత్యనారాయణ, బొడ్డేటి రామకృష్ణ, అమరాది నాగేశ్వరరావు, గొనగాల తాతారావు ఉన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మీసాల రాజు, వెన్నా ఈశ్వరుడు, పర్వత సురేష్, జలిగంపల ప్రభాకరరావు, మంతెన పద్మనాభ రాజు, మిరియాల శ్రీను, యాళ్ళ విశ్వేశ్వరరావు, జింకల ఫకీర్, జెక్కా సత్తిబాబు, మాజీ సర్పంచ్ సింగిడివెంకటేష్ పాల్గొన్నారు.

ఓట్లు తొలగింపునకు ఎమ్మెల్యే కుట్ర

మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 3: ఓటమి భయంతోనే టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగింపునకు ఎమ్మెల్యే ద్వారంపూడి కుట్ర పన్నాడని, ఓట్ల తొలగింపునకు బల్క్‌గా ఫారం-7 ధరఖాస్తులు చేసిన వ్యక్తులను ఐపీ అడ్రస్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేయాలని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఓటరు ముసాయిదా జాబితాలో అవకతవకలపై శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండబాబు మాట్లాడారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు కాకినాడ వైసీపీ కార్యాలయం నుంచి బల్క్‌గా ఫారం-7 దరఖాస్తులు చేయించారన్నారు. ఓటర్ జాబితా అవకతవకలపై గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏ చర్యలు చేపట్టలేదన్నారు. కాకినాడలో నమోదైన దొంగ ఓట్లు, టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వారి ఆదేశాల మేరకు జిల్లా అధికారులు కాకినాడలో 22 ఎఫ్ఐఆర్‌లు వేసి 130 మందిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఏ విచారణ చేపటలేదన్నారు. అనధికారికంగా కార్పొరేషన్ లాగిన్‌లో వైసీపీ కార్యకర్తల పేర్లపైనే ఓట్ల తొలగింపునకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ధరఖాస్తులు చేశారన్నారు. ద్వారంపూడిని నమ్ముకున్న వారు ఎవరైనా జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతుందని, దొంగ ఓట్ల వ్యవహారంలో కీలక వ్యక్తులను వదిలేసి అమాయకులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బంది చేత ఆధార్ కార్డులు తీసుకుని ఓట్లు తొలగించే ప్రయత్నం చేశారన్నారు. ఓట్లు తొలగించమని ఆన్‌లైన్‌లో ధరఖాస్తులే చేసిన వ్యక్తులను ఐపీ అడ్రస్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా కాకినాడలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిని ప్రోత్సహించేది ఎమ్మెల్యే అన్నారు. రాబోయే ఎన్నికల్లో ద్వారంపూడికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన చెప్పారు సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నేతలు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, సయ్యద్ ఆలీ పాల్గొన్నారు.

మోసం చేసేందుకు సిద్ధమైన సీఎం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల



సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

జగ్గంపేట, ఫిబ్రవరి 3: మెగా డీఎస్సీ పేరుతో ఎన్నికలకు కొత్త డ్రామా తెరలేపుతున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మరోసారి నిరుద్యోగులను మోసం చేయడానికి సిద్ధమయ్యాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ విమర్శించారు. ఇర్రిపాక శివాలయం వద్ద శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏలూరులో ముఖ్యమంత్రి సభకు జనాలను తరలించేందుకు బస్సులు సమకూర్చుకునేందుకు ఇంటర్మీడియట్ పరీక్షలు వాయిదా వేసి విద్యార్థుల జీవితాల్లో ఆటలాడుతున్నాడన్నారు. 50892 పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులు భర్తీ చేయడం నిరుద్యోగులను వంచించడానికి మరోసారి జగన్ సిద్ధమయ్యాడని నెహ్రూ అన్నారు. నిరుద్యోగుల ఆశలపై కల్లబొల్లి మాటలతో బొత్స నీళ్ళు చల్లారని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌తో యువతకు ఉద్యోగం కల్పిస్తానన్న జగన్ ఐదేళ్ల ఏం చేశాడని ప్రశ్నించారు. కాకినాడకు చెందిన పోలీసులు హైదరాబాద్‌లో గంజాయిస్మగ్లింగ్‌లో దొరకడం దురదృష్టకరమని, పోలీసులే గంజాయి అమ్మే పరిస్థితికి జగన్ రాష్ట్రాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, తోట సర్వారాయుడు, మండపాకఅప్పన్నదొర, వేగి రామకృష్ణ, పెనగంటి బాబ్జి, కరణంబోరయ్య, బొడ్డేటి సుమన్, గల్లాశ్రీను, కందమణిదీప్, జ్యోతుల వీరభద్రరావు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ 95శాతం మేనిఫెస్టో అమలు చేశానని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ఒక్క హామీ అయి నా సంపూర్ణంగా అమలు చేశారా అని ప్రశ్నించారు. వీటన్నిటిపై రేపుప్రజల్లో తిరుగుతూ వివరాలు తెలియజేస్తానన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లగా అపూర్వ ఆదరణ లభించిందని మరికొన్ని పథకాలతో టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో మరొక వారం రోజుల్లో రాబోతుందన్నారు. జగన్ ఓట్లు అడిగే ముందు క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాసి ఓట్లు అడగాలన్నారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, దాపర్తి సీతారామయ్య, పీటీ ప్రసాద్ తదితరులున్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్

మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో ప్రచారం చేస్తున్న వర్మ

పిఠాపురం, ఫిబ్రవరి 3: ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి నిరుద్యోగులను నిలువునా మోసం చేశాడని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో శనివారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. వర్మ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అన్నారు. యువతకు ఉపాధి లేకుండా చేశారని, జగన్ సిద్ధం సభ కోసం ఏకంగా ఇంటర్మీడియట్ పరీక్షనే వాయిదా వేశారని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో జగన్ ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశ్రమల యజమానులు పోటీపడ్డారని, నేడు ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోతున్నాయని తెలిపారు. ఏపీని గంజాయి రాష్ట్రంగా మార్చివేశారని, దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఇక్కడే ఉంటున్నాయని చెప్పారు. జగ్గయ్యచెరువు కాలనీలో ఎంపీడీవో కార్యాలయ సమీపంలో కోట్లు విలువ చేసే ఖాళీ స్థలాలును వైసీపీ కౌన్సిలర్లు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. నిరుపేదలకు చెందాల్సిన స్థలాలును కబలించాలని అధికార పార్టీ నేతలు చూడడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఖాళీ స్థలాలను పేదలకు పంచుతామని వర్మ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, విల్లి చిన్నా, బర్ల అప్పారావు, వాసంశెట్టి సూరిబాబు, కర్రి లోవరాజు, గరగపాటి రమణ, గాయత్రి, దుర్గాప్రసాద్, మౌళీ, తనుకులయ్య, నూకరాజు, చోటూ, సంతోష్, నామా దొరబాబు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, కోళ్ల బంగారుబాబు, అయితే రాంబాబు, మసకపల్లి రాజా తదితరులున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

గండేపల్లి, ఫిబ్రవరి 3: సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కాకినాడ మెడికో హాస్పటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రదీప్ భాస్కర్ మాట్లాడుతూ శరీరంలో ఎక్కడ కణితలు ఏర్పడినా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో క్యాన్సర్‌ను నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోలా సంజయ్, ఎ.రామకృష్ణ, చిట్టూరు ప్రసాద్, రాఘవేంద్రన్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి నానాజీ



మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న నానాజీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 3: పరిశ్రమల నుంచి వెదజల్లుతోన్న కాలుష్యంతో తీరప్రాంతంలో నివసిస్తోన్న మత్స్యకారులు కంటిచూపు,శ్వాసకోశ వంటి అనారోగాలతో బాధపడుతున్నారని, కాలుష్య నియంత్రణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ డిమాండ్ చేశారు. జనం కోసం పవన్, పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా శనివారం సూర్యారావుపేట శివారు షైనర్‌పేటలో ఇంటింటికీ వెళ్లి మత్స్యకారుల సమస్యలు తెలుసుకుని జనసేన,టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు ఇచ్చి, స్థలాలు చూపించకుండా వైసీపీ నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి మంచినీటి సమస్య, కలుషిత మంచినీటితో ప్రజలు బాధపడుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పరిశ్రమలతో నిర్వాహకులు కోట్లు ఆర్జిస్తున్నారని, కాలుష్యాన్ని ప్రజలకు అంటగడుతున్నారన్నారు. అర్హులకు పట్టాలు ఇవ్వకుండా జనసేన కార్యకర్తలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా చేశారన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాలప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, రాబోయే ఎన్నికల్లో జనసేన-టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు ఉమ్మడి ప్రభుత్వంతోనే ఉందన్నారు. పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, సోడె ముసలయ్య, ఎల్లబోయిన రామకృష్ణ, వంకా ధనకొండ, గరికిన సురేష్, సూరాడ శ్రీను తదితరులున్నారు.

మహిళలకు గుర్తింపునిచ్చిన చంద్రబాబు

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ



మహిళలతో మాట్లాడుతున్న సత్యప్రభ

రౌతులపూడి, ఫిబ్రవరి 3: మహిళలకు గుర్తింపునిచ్చింది, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పడింది టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడేనని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం మండలంలోని రాజవరంలో ఆమె పర్యటించి మహిళలతో కాసేపు ముచ్చటించారు. టీడీపీ ప్రభుత్వమే మహిళలకు గుర్తించిందన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన, మృతిచెందిన కుటుంబ సభ్యులను సత్యప్రభ పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీలు గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గొల్లపల్లి బుజ్జి, చింతకాయల రాజు, పర్వత సురేష్, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, పైలసాంబశివరావు పాల్గొన్నారు.

ఈఆర్వో పోలింగ్ స్టేషన్ల సందర్శన



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వెంకట్రావు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 3: సిటీ నియోకవర్గ ఈఆర్వో, మున్సిపల్ కమిషనర్ జె.వెంకట్రావు శనివారం పలు పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. పోలీస్ లైన్ ఆవరణలోని 14,15,16 పోలింగ్‌స్టేషన్లకు వెళ్లిన ఆయన సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలపై ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో సౌకర్యాల కొరత సదుపాయాల కల్పనకు సంబంధించి అవసరాలు ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈఆర్వోలు దొర, సీతాపతిరావు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహశీల్దార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

గొల్లప్రోలు, ఫిబ్రవరి 3: గొల్లప్రోలు తహశీల్దార్‌గా ఎం.ఉదయభాస్కర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా అగిరిపల్లి తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఉదయభాస్కర్‌ను డిప్యూటీ తహశీల్దార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు అభినందించారు.

పోటీ పరీక్షలపై నేడు ఉచిత అవగాహన సదస్సు

సామర్లకోట, ఫిబ్రవరి 3: ఏపీపీఎస్సీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలపై సామర్లకోట చక్కెర అతిథిగృహం ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉచిత అవగాహన సదస్సు గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో నిర్వహించనున్నట్టు ఫ్యాకల్టీలు తాతపూడి సుశీల్ కుమార్, కాకర ముత్యాలరావు, వైభోగులు గోపాలకృష్ణ తెలిపారు. అనంతరం స్టడీ మెటీరియల్‌ను చంద్రమౌళి చేతుల మీదుగా అందజేస్తామని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఆర్టీసీ రైతు బజారు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 3: నగరంలోని ఆర్టీసీ రైతు బజారు వినియోగదారులకు సేవలందించిన సిరిపురం లోవరాజు అకస్మిక మృతికి సంతాపం ప్రకటిస్తూ రైతు బజారు సిబ్బంది, రైతులు, రైతు కమిటీ సంఘం ఈనెల 5న సోమవారం రైతు బజారుకు సెలవు ప్రకటించినట్టు ఎస్టేట్ ఆఫీసర్లు పిజివివి కృష్ణారావు, ఎం.గోవిందరాజు తెలిపారు.

6న 'ఛలో అసెంబ్లీ'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3: పంచాయతీల నిధులు దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని జిల్లా టీడీపీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నందమూరి రాజా కోరారు. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 6న సర్పంచ్‌ల చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచ్‌లు తరలిరావాలని కోరారు.

రౌతులపూడి: ఈనెల 6న విజయవాడలో నిర్వహించే ఛలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నందమూరి రాజా కోరారు.

7న జయహో బీసీ సభ

తాళ్లరేవు, ఫిబ్రవరి 3: తాళ్లరేవు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనెల 7న మధ్యాహ్నం జరిగే జయహో బీసీ సభను ప్రతీ ఒక్కరూ విజయవంతం చేయానలి బీసీసెల్ మండలాధ్యక్షుడు జిత్తుగ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో అన్ని గ్రామ కమిటీలతో కలసి జనసమీకరణ కోసం సమావేశాలు నిర్వహించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు తదితరులున్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, ఫిబ్రవరి 3: పట్టణ పరిధిలో దేవదాయ శాఖకు చెందిన రాణీ వత్సవాయి బుచ్చి సీతాయమ్మ సత్రం (మహారాణీ సత్రం) ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సత్రం ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. 20రోజుల్లోపు దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ (కాకినాడ)కు పంపాలన్నారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 3: మండలంలోని ఈ.గోకవరంలో పిచ్చుక వెంకటలక్ష్మి అనే దివ్యాంగ యువతికి సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు రూ.6వేలు ఆర్థిక సహాయం, దుస్తులు అందజేశారు. సంఘం నాయకులు ముచ్చి అప్పలరాజు, ఒమ్మి గంగరాజు, ఒమ్మి వరహాలు, మన్యాల కుసరాజు, గీతాల రాజబాబు, కుండల శ్రీను, కె.లక్ష్మీనారాయణ, చిలపర్తి శ్రీనివాస్ ఉన్నారు.

ఉచితంగా భోజన సదుపాయం

పిఠాపురం, ఫిబ్రవరి 3: పశువులసంత వద్ద సాయిప్రియ సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం 42వ వారం కొనసాగింది. శనివారం పశువుల సంతకు వచ్చినవారికి ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు.

తహశీల్దార్‌కు సత్కారం

కాజులూరు, ఫిబ్రవరి 3 కాకినాడ ఏవోగా బదిలీ అయిన కాజులూరు తహశీల్దార్ సాయి సత్యనారాయణను మండల రెవెన్యూ ఉద్యోగులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు,దుశ్శాలువాతో సన్మానించారు. తనకు సహకరించిన రెవెన్యూ యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'సమన్వయంతో పని చేయాలి'

తుని రూరల్, ఫిబ్రవరి 3: సమన్వయంతో పని చేస్తే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చి తీరుతుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమ కృష్ణుడు అన్నారు. శనివారం తుని రూరల్ చామవరం గ్రామంలో టీడీపీ,జనసేన కార్యకర్తలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించి, తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామంలోని జనసేనకి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

'ఇళ్ల పట్టాలివ్వాలి'



చొల్లంగిలో దీక్ష చేస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు, ఫిబ్రవరి 3: చొల్లంగి సర్వేనెంబర్ 47/3లో 4.24 సెంట్లు భూమిలో ఇళ్ల పట్టాలివ్వాలని గ్రామస్తులు చేపట్టిన నిరసనదీక్ష శనివారంతో 4రోజులకు చేరుకుంది. టీడీపీ నేత కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ జి.వేమవరం, పటవల గ్రామాల్లో ఇచ్చిన పట్టాలను రద్దు చేసి స్థానికంగా ఉన్న చొల్లంగి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీఇచ్చేవరకు దీక్ష కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, ఫిబ్రవరి 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ నుంచి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణారావు, సూపరెంటెండెంట్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: గేమ్ ఆన్ , అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, హైండ్, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్, అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గేమ్‌ఆన్

తిరుమల	:	ధీర
లక్ష్మి	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సీ అండ్ సీ 1	:	బూట్‌కట్ బాలరాజు
సీ అండ్ సీ 2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	అంబాజీ మ్యారేజిబ్యాండు